కొనసాగుతున్న నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు

బాన్సువాడ శివారులో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు

బాన్సువాడ, జూన్ 14 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కన నిర్మిస్తున్న బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో మంజూరైన సుమారు 40 కోట్ల రూపాయలతో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కృషితో భవనం మంజూరైంది. నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. త్వరగా పనులు పూర్తయితే కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి రానున్నది.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కామారెడ్డి, జూన్ 14 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌సీఎల్ టెక్ బీ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించినట్లు ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళా ద్వారా సాఫ్ట్‌వేర్ రంగంలో శిక్షణ పొందుతూ ఉన్నత విద్యను కూడా అభ్యసించవచ్చని తెలిపారు. కామారెడ్డి పట్టణ చుట్టు పక్కల నుంచి సీఈసీ, హెచ్‌ఈసీ, వొకేషనల్ గ్రూప్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సుమారు 70 మందికిపైగా పాల్గొన్నారని తెలిపారు. ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ టెక్ బీ ఏరియా ప్రతినిధి రాజేశ్‌కుమార్, వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో భారీ వర్షం

గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో కురుస్తున్న వర్షం

మాచారెడ్డి, జూన్ 14 : మాచారెడ్డి మండల కేంద్రంతోపాటు గజ్యానాయక్‌తండా, ఎక్స్ రోడ్, ఘన్‌పూర్, చుక్కాపూర్ గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. గజ్యానాయక్‌తండాలో ఇటీవల నాలుగు వరుసల రహదారి నిర్మించారు. డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఇండ్లల్లోకి భారీగా వరద నీరు చేరింది. వెంటనే రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

భిక్కనూరు, జూన్ 14 : మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట్‌కు చెందిన పాముల రాజేందర్(40) జంగంపల్లి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన కోళ్లఫారం దగ్గరలో ఉన్న పొలంలో గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. రాజేందర్ తండ్రి కాలికి గాయం కావడంతో రక్తం అవసరమైంది. దీంతో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు వెళ్లి తన తండ్రికి రక్తం ఇచ్చాడు. తన దగ్గర డబ్బులు లేవని ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి రాలేదన్నారు. భర్త మతిస్థిమితం కోల్పోయి, సరిగా తినక తిరగడం, దీనికి తోడు ఎండదెబ్బ తగలడంతో స్పృహ కోల్పోయి మృతి చెందాడని, భార్య గోదావరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వానాకాలం సాగుకు అంతాసిద్ధం

- దుక్కులు దున్నిన రైతులు
- సేంద్రియ వ్యవసాయమే మేలంటున్న అధికారులు

వానాకాలం సాగు కోసం సిద్ధం చేసుకున్న వ్యవసాయ భూమి

దోమకొండ, జూన్ 14 : వానాకాలం రావడంతో పంట పొలాలను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. నైరుతి రుతు పవనాల రాకతో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు వాతావరణం కొద్దిగా చల్లబడింది. చాలా గ్రామాల్లో ఇప్పటికే తమ పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసుకున్న రైతులు ఎప్పుడెప్పుడు వరి నారు మడులు పోసుకుందామా అని ఎదురుచూస్తున్నారు. దీంతో వ్యవసాయ అధికారులు, రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ప్రధానంగా సాగయ్యే పంట వరి..

వరి పంట విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో అధికారులు, రైతులు దీనిపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా వరి, ఇతర పంటలకు సాగు కావాల్సిన విత్తనం అందజేయడం మొదలుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో వ్యవసాయం..

సేంద్రియ ఎరువులతో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరే అవకాశముందని, పేడ, వానపాముల ఎరువులతో భూసారం పెరగడానికి అస్కారం ఉందని, దిగుబడులు సైతం ఆశించిన స్థాయిలో వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పశువుల పేడను ఎరువుగా పొలాల్లో చల్లుకోవడంతో పెట్టుబడి సైతం తగ్గుతుందని, వీటి వాడకంతో పర్యావరణాన్ని కాపాడినట్లు అవుతుందని పేర్కొంటున్నారు.

అందుబాటులో విత్తనాలు, పురుగుల మందులు..

వానాకాలం సందర్భంగా రైతులకు అందుబాటులో విత్తనాలు, వివిధ రకాల పురుగు మందులను లైసెన్స్ ఉన్న దుకాణదారులు అందుబాటులో ఉంచినప్పటికీ, కొందరు వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చాలా చోట్ల ఎలాంటి లైసెన్స్‌లు లేకుండానే విత్తనాలతోపాటు గడ్డి మందులను రైతులకు విక్రయిస్తున్నారు. నాసి రకం మందులు అని తెలియక రైతులు వారిని గుడ్డిగానమ్మి కొనుగోలు చేస్తున్నారు.

విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్నాం

రైతులు ఐదు సెంటిమీటర్ల వర్షం నమోదైన తర్వాత, లేదా నీరు పారబెట్టుకొన్న తర్వాత విత్తనాలు వేసుకోవాలి. ప్రతిరోజు వ్యవసాయాధికారులు విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. విత్తనాలకు సంబంధించి ఎలాంటి అనుమానాలు, సందేహాలు ఉన్నా మండల వ్యవసాయాధికారి 7288894613 నంబర్‌ను సంప్రదించాలి.

- పవన్ కుమార్, మండల వ్యవసాయాధికారి

ఉత్తమ రక్తదాత అవార్డు బాలుకు

బాలుకు అవార్డును అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కామారెడ్డి, జూన్ 14 : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ సంస్కృతి ఆడిటోరియంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ రక్తదాత అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు 73సార్లు రక్తదానం చేయడంతోపాటు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం, అత్యవసర పరిస్థితులో ఉన్నవారికి రక్తాన్ని అందించినందుకు రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్తమ రక్తదాత అవార్డును అందజేశారు.

బక్రీద్‌కు ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి

ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, జూన్ 14 : పట్టణంలోని కోర్టు రోడ్‌లో ఉన్న ఈద్గాను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండుగను పురస్కరించుకొని నీటి సౌకర్యం, టెంట్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈద్గావద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి చదును చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, వంశీ, హఫీస్, పాత శివకృష్ణమూర్తి, అన్వర్ హైమద్, ఎండీ లడ్డు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మహ్మద్ ఇషాక్ షేరు, సలీం, ఇమ్రాన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నల్లా కలెక్షన్ల పరిశీలన

బీబీపేట్, జూన్ 14 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం మిషన్ భగీరథ కలెక్షన్లను ఇంటింటికీ తిరుగుతూ పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. యాడారం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణా గౌడ్ మిషన్ భగీరథ కలెక్షన్ల వివరాలను నమోదు చేసుకున్నారు.

సమయపాలన పాటించని వైద్యులు

కామారెడ్డి రూరల్, జూన్ 14: కామారెడ్డి పట్టణంలోని ఇస్లాంపుర అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించడలేదు. ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న ఓ వైద్యాధికారిణి సమయపాలన పాటించడంలేదు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తనకు ఇష్టం వచ్చినప్పుడు రావడమే కాకుండా.. పట్టణంలోని ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తుండడం గమనార్హం. సమయపాలనపై సదరు వైద్యాధికారిణిని సంప్రదించగా.. జిల్లాలోని ఏ దవాఖానలో కూడా వైద్యులు సమయపాలన పాటించడంలేదని, ప్రభుత్వం నిర్దేశించిన సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అని, కానీ తాను ఒంటిగంట వరకు మాత్రమే పనిచేస్తానని, తన మాదిరిగానే మిగతా చాలా మంది వైద్యులు ఇతర దవాఖానల్లో చేస్తున్నారని చెప్పడం గమనార్హం.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్

బాన్సువాడ రూరల్, జూన్ 14 : కార్పొరేట్ కళాశాలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న స్వయం ప్రతిపత్తి గల శ్రీరాం నారాయణ్‌ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ విద్యార్థులను కోరారు. కళాశాలలో కళాశాల ప్రచార రథాన్ని, కరపత్రాలను అధ్యాపకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో అందిస్తున్న కోర్సులు, ఫలితాలు వివరిస్తూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోల్లో మండలాల్లో ప్రచార రథంతో ప్రచారం నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కళాశాలలో చేరాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోపాల్, గంగాధర్, వెంకట్‌రావు, యూనిస్, సుధాకర్‌రెడ్డి, శ్రీదేవి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం

కామారెడ్డి, జూన్ 14 : పట్టణ పరిధిలో ఉన్న 11వ వార్డులోని లింగాపూర్‌లో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలకు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఉమారాణి, ఆయా లక్ష్మి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో లైన్‌మన్‌కు తీవ్ర గాయాలు

బాన్సువాడ రూరల్, జూన్ 14 : మండలంలోని తాడ్కోల్ గ్రామంలో విద్యుత్‌షాక్‌తో లైన్‌మన్ దస్తగిరికి తీవ్రగాయాలయ్యాయి. శుక్రవారం గ్రామంలో విద్యుత్ సరఫరాకు మరమ్మతులు చేపడుతుండగా షాక్‌కు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన లైన్‌మన్‌ను హుటాహుటీనా బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట్ గ్రామానికి చెందిన దస్తగిరి మూడు సంవత్సరాలుగా తాడ్కోల్‌లో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కడుపునొప్పి తాళ లేక యువకుడు ఆత్మహత్య

భిక్కనూరు, జూన్ 14 : కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి చెందాడని ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం తిప్పాపూర్‌కు చెందిన నారేగళ్ల ప్రవీణ్ కుమార్(19) కడుపు నొప్పి భరించ లేక ఈ నెల 4న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి

కస్తూర్బా పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ

రామారెడ్డి, జూన్ 14: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈనెల 13వ తేదీన నమస్తే తెలంగాణలో కస్తూర్బాలో టీచర్ల తీరుపై ప్రచురితమైన 'అలా వచ్చారు.. ఇలా వెళ్లారు' అనే వార్తకు ఆయన స్పందించారు. ఈ సందర్భంగా టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో మాట్లాడారు. తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు లేదా మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ల్యాగల మహిపాల్, కర్రోళ్ల రాజు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఎన్ఎమ్ఎమ్ఎస్‌కు ముగ్గురు విద్యార్థినుల ఎంపిక

నాగిరెడ్డిపేట, జూన్14: మండలంలోని గోలిలింగాల ప్రాథమికోన్నత పాఠశాల, మాల్తుమ్మెద ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎమ్ఎమ్ఎస్)నకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటరాజు, దేవయ్య శుక్రవారం తెలిపారు. గోలిలింగాల పాఠశాలకు చెందిన సావిత్రి, మాల్తుమ్మెద పాఠశాలకు చెందిన కుడికాల సహస్ర, జంగం భువనేశ్వరి ఎన్ఎమ్ఎమ్ఎస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. స్కాలర్‌షిప్‌నకు విద్యార్థినులు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S Shriram Finance Ltd, Banswada Branch, Dist. Kamareddy** agreed to accord Loan to **Yedla Krishna** S/o Shivaram, Age 32 Yrs, Occ: Business, R/o.H.No.1-78/1, Nachupally (V), Nasrullabad (M), Kamareddy (Dist) mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

All that the Open Place (Dismantled house) bearing GP No.1-62, admeasuring Eastern side 40'-0" fts, Western side 38'-0" fts, Northern side 17'-6" fts, Southern side 26'-0" fts total 848.25 Sq.Fts equal to 94.25 Sq.Yds or say 78.80 Sq.Mtrs situated at Nachupally Village of Nasrullabad Mandal, Kamareddy District, within the limits of Gram Panchayat Nachupally under the jurisdiction of Regn.Sub Dist Banswada and Dist.Regn. (Subject matter to the Regd.Sale Deed Doct No.265/2024 Dtd.27.01.2024 SRO Banswada) **Bounded as below. East** : House of Edla Shankar **West**: G.P. Road **North**: G.P.Drain after Tin Shed of Raya Sayavva **South**: Tin shed of Edla Rodda Sailu

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhash Nagar,Nizamabad Cell:9848094409

పిచ్చికుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

ఎల్లారెడ్డి, జూన్ 14: తాడ్వాయి మండలంలోని సోమారం తండాలో పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో పిచ్చికుక్క గురువారం సాయంత్రం శైలజ (4)తోపాటు మరొకరిని కరిచింది. శైలజ తల కు తీవ్ర గాయాలు కావడంతో ఆమె ను హైదరాబాద్ తరలించి ఆపరేష న్ చేయించినట్లు తెలిసింది. చిన్నారి పరిస్థితిపై రెండు రోజుల వరకు ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపిన ట్లు సమాచారం. అదే కుక్క శుక్రవా రం గ్రామానికి చెందిన నారాయణ ను కరిచిందని గ్రామస్తులు తెలిపారు.

కాలభైరవుడిని దర్శించుకున్న జిల్లా జడ్జి

జడ్జికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

రామారెడ్డి, జూన్ 14: మండలంలో వెలిసిన కాలభైరవ స్వామి ఆలయంలో కామారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జడ్జి దంపతులను ఆలయ ఈవో ప్రభురాంచంద్రం శేష వస్త్రాలతో సన్మానించారు. ఆలయ పూజారులు స్వామి వారి చిత్రపటంతోపాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆలయ సిబ్బంది భరత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

గాంధారి, జూన్ 14: గాంధారి మండలంలోని పేట్‌సంగెం, రాంపూర్ గడ్డ, మాతుసంగెం, పొతంగల్ కుర్దు గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ తాగునీటి కుళాయిల సర్వేను ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆయనవెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరి మృతి

పెద్దకొడప్‌గల్, జూన్ 14: అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన పిట్లంలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం మారడి గ్రామానికి చెందిన చాకలి కాశీరాం(29) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసైన అతడు సంపాదించిన డబ్బులు తాగుడుకు ఖర్చు చేసేవాడు. తల్లిదండ్రులు, భార్య మందలించినా.. అతడిలో మార్పు రాలేదు. గురువారం పిట్లం వెళ్లివస్తానని చెప్పి ఆటో తీసుకొని ఇంటి నుంచి బయల్దేరాడు. పిట్లంలోని సాయిగార్డెన్ వెనుకాల తన ఆటో ఆపి మద్యం తాగాడు. ఆటోలోనే మృతిచెందాడు. శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పిట్లం పోలీసులు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలి

- టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా సభ్యురాలు అపర్ణ
- ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేటల్లో ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

గాంధారి, గోపాల్‌పేటలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న టాస్క్‌ఫోర్స్ బృందం

ఎల్లారెడ్డి రూరల్/ గాంధారి/ నాగిరెడ్డిపేట, జూన్ 14: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు ఫర్టిలైజర్ దుకాణాదారులకు సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని విత్తన విక్రయ దుకాణాలను వారు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిష్టర్లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు, బిల్‌బుక్కులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లా సభ్యులు అపర్ణ, శ్రీనివాస్, పవన్‌కుమార్, ఎల్లారెడ్డి వ్యవసాయాధికారి హరీశ్, ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ అపర్ణ మాట్లాడుతూ.. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణాదారులకు హెచ్చరించారు. ఎమ్మార్పీకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేశ్, కామారెడ్డి, దోమకొండ వ్యవసాయాధికారులు శ్రీనివాస్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేటలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారిణి అపర్ణ డీలర్లను హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో ఏవోలు శ్రీనివాస్, పవన్‌కుమార్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి ఎస్సైలు రాజు, మహేశ్, నాగిరెడ్డిపేట ఏవో విజయశేఖర్ పాల్గొన్నారు.

ఒంటరితనం భరించ లేక యువకుడి ఆత్మహత్య

నగేశ్(ఫైల్)

లింగంపేట, జూన్14: చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతి చెందడంతో ఒంటరితనం భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిసిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేటకు చెందిన కాశ నగేశ్ (20) తల్లిదండ్రులు సాయవ్వ, బాలయ్య 15 సంవత్సరాల క్రితం మృతి చెందారు. అప్పటి నుంచి ఆయన తమ పెద్ద నాన్న చంద్రయ్య వద్ద ఉంటున్నాడు. కూలి పని చేసుకొని జీవించే అతడు తరచూ ఒంటరితనంతో బాధపడేవాడు. శుక్రవారం ఉదయం కూలీ పనులకు వెళ్లి వచ్చిన అనంతరం గ్రామశివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి పెద్దనాన్న చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి సర్కారు దవఖానాకు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

హైవే విస్తరణ పనులు ప్రారంభం

గుట్టను తవ్వుతున్న హిటాచి

నాగిరెడ్డిపేట, జూన్14 : కామారెడ్డి జిల్లా సరహద్దు గ్రామం పోచారం వద్ద నూతన జాతీయ రహదారి 765డీ విస్తరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. హైవే అథారిటీ అధికారులు పోచారం శివారులో మూలమలుపు వద్ద పోచారం ప్రాజెక్టు దిగువన బ్రిడ్జి పనుల కోసం కొలతలు వేశారు. మూలమలుపు వద్ద గుట్టను జేసీబీ, హిటాచి సహాయంతో తొలగిస్తున్నారు. జాతీయ రహదారి పనులు ప్రారంభం కావడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

శాంతి కమిటీ సమావేశాల్లో పోలీసులు

మద్నూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

నిజాంసాగర్/ మద్నూర్/ నాగిరెడ్డిపేట/ పెద్దకొడప్‌గల్/ భిక్కనూరు, జూన్ 14: పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. నిజాంసాగర్, మద్నూర్, నాగిరెడ్డిపేట, పెద్దకొడప్‌గల్ పోలీస్ స్టేషన్లలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు సుధాకర్, శ్రీకాంత్, రాజు, కోనారెడ్డి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా పండుగలను నిర్వహించుకోవాలని అన్నారు. గో హత్య నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశాల్లో ఆయా గ్రామాల మత పెద్దలు పాల్గొన్నారు. భిక్కనూరులోని పద్మశాలీ కల్యాణ మండపంలో శాంతి కమిటీ సమావేశాన్ని సీఐ సంపత్‌కుమార్ నిర్వహించారు. ఎస్సై సాయికుమార్ తహసీల్దార్ శివ ప్రసాద్, శ్రీరామ దండు సభ్యులు, ముస్లీం సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం.. పాఠ్యపుస్తకాల పంపిణీ

గాంధారి, జూన్ 14: గాంధారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నారులకు అక్షారాభ్యాసం చేయించారు. పాఠశాలలో కొత్తగా చేరిన చిన్నారులతో పలకలపై అక్షరాలు దిద్దించారు. ఎంఈవో సేవ్లానాయక్ మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో బోధన ఉంటుందని, చిన్నారులను సర్కారు బడుల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తూర్పు రాజులు, హెచ్ఎం భవానీ, సయ్యద్ అహ్మద్, గంగి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ..

ఎల్లారెడ్డి/రామారెడ్డి, జూన్ 14: సదాశివనగర్ మోడల్ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ గైని అనసూయ శుక్రవారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలువాలని ఆకాంక్ష